నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, శనివారం 18 మే 2024 | JAGTIAL



మంథని: కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలో నుంచి వరద నీటిని చీపురుతో బయటికి పంపుతున్న రైతు

### నెల రోజులైనా కొంటలేరు



మా ఊరు మర్తనపేట. నేను ఆరెకరాల్లో వరి పండించిన. నెల కిందనే వరి కోసి వడ్లను మా ఊరి కేంద్రంల పోసిన. అప్పటి నుంచి వడ్లను కొనెటోళ్లు లేరు. రోజూ వడ్లను నేర్పుడు.. మబ్బుల పడితే కవర్లు కప్పుడే పనైతంది. మస్తు తిప్పలైతంది. టార్పాలిన్లు సరిగ్గా లేక వాన కొడితే ధాన్యం తడుస్తంది. ఇప్పటికే కొన్ని వడ్లు మొలకచ్చినయ్. అయినా ఎవరూ పట్టించుకునెటోళ్లు లేరు. చినుకు పడినప్పుడల్లా రైతులమందరం వణికిపోతున్నం. ఇట్ల రైతును అరిగోస పెట్టుడు మంచిది కాదు. తొందరగా ధాన్యం కొంటే మాకీ గోస వచ్చేది కాదు. ఇప్పటికైనా సర్కారు పట్టించుకోవాలె.

**- మర్రిపల్లి పరశురాములు, రైతు, మర్తనపేట (కోనరావుపేట)**

### లారీలు రాక గోసయితంది



మాది వేములవాడ మండలం అనుపురం. మా వడ్లను నాంపెల్లి సొసైటీవాళ్లు కొంటున్నరు. అనుపురంలోని కొనుగోలు కేంద్రానికి నెల రోజుల కింద వడ్లు తెచ్చినం. వడ్లను ఎండిబోసిన తర్వాత మాయిచ్చర్ రాగానే నాలుగు రోజులకు కాంట పెట్టిన్రు. కానీ, లారీలు రాక రామగోస అయితంది. ఇప్పటికీ ధాన్యం బస్తాలు సెంటర్లనే ఉన్నాయి. ఓ వైపు వానలు పడుతున్నయి. ఎట్ల కాపాడుకోవాలో అర్థమైతలేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఇప్పుడు, అప్పుడు అంటున్నరే తప్ప లారీలైతే వస్తలేవు. బస్తాలు తడిసేటట్టు ఉన్నయి.

**- మురంచెట్టి లచ్చయ్య, రైతు (అనుపురం)**

### రైతులకు నష్టమే..



సారు మాది ధర్మారం మండలం నందిమేడారం. నేను రెండున్నర ఎకరాల్లో వరి పండించిన. పదిహేను రోజుల కింద వరి కోసం మా ఊరిలోని కేంద్రానికి వడ్లు తెచ్చిన. మంచిగా ఎండబెట్టిన. తేమ శాతం 17లోపు ఉందని సిబ్బంది చెప్పిన్రు. కానీ, మా లారీలు వస్తలేవని ధాన్యం తరలిస్తలేరు. గోనె సంచులు ఇస్తలేరు. నేను రోజు ఇక్కడే కాపాలా ఉండాల్సి వస్తంది. ధాన్యం కుప్పపై కవర్లు కప్పి ఉంచిన. వర్షానికి కుప్ప చుట్టు నీరు నిలుస్తంది. వాన పడ్డప్పుడల్లా భయమైతంది. కవర్‌పై నిలిచిన నీళ్లు తీసేసి కాపాడుకుంటున్న. రోహిణి కార్తె వచ్చే లోపల మా వడ్లు కొనకుంటే రైతులకు నష్టమే.

**- సామంతుల స్వామి, రైతు (నంది మేడారం)**



ధర్మారం: నందిమేడారం కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడవకుండా ధాన్యంపై కప్పిన కవర్లు

# ధాన్యం రైతు అరిగోస

## కొనుగోళ్లలో నిర్లక్ష్యం.. అన్నదాతకు శాపం

- వెంటాడుతున్న అకాల వర్షం ముప్పు
- కేంద్రాల్లో పేరుకుపోతున్న రాశులు
- పది హేను రోజులైనా సాగని కొనుగోళ్లు
- కొన్నది తరలించడంలోనూ జాప్యమే
- వర్షాలకు తడుస్తున్న వడ్ల కుప్పలు
- కడుపుమండి రోడ్డెక్కుతున్న రైతులు
- మైతాపూర్, అనుపురంలో ధర్నాలు

రైతాంగం అరిగోస పడుతున్నది. ధాన్యం కొనుగోళ్ల వేళ ఆదుకునే దిక్కులేక కన్నీరు పెడుతున్నది. మొన్నటిదాకా సాగునీరు లేక, కరెంట్ సరిగ్గా ఉండక అరిగోస పడి, పండించిన కొద్దిపాటి ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తే.. సకాలంలో కొనేవారు లేక ఆగమవుతున్నది. సెంటర్లకు వడ్లు తెచ్చి పదిహేను ఇరువై రోజులైనా కొనకపోవడం, మరోవైపు లారీల కొరతతో కొన్నది వెనువెంటనే మిల్లులకు తరలించకపోవడంపై మండిపడుతున్నది. అటు ధాన్యాన్ని, ఇటు బస్తాలను కాపుకాయలేక, అకాల వర్షానికి కాపాడుకోలేక ఆందోళన చెందుతున్నది. అక్కడక్కడ కండ్ల ముందే తడిసిపోతుండడంతో ఆవేదన చెందుతున్నది. కొద్ది రోజుల నుంచి ముప్పు వెంటాడుతున్నా పట్టించుకునే వారు లేక ఆగ్రహిస్తున్నది. శుక్రవారం మైతాపూర్, అనుపురంలో రైతులు కడుపుమండి రోడ్డెక్కారు. వెంటనే ధాన్యాన్ని కొనాలని, లారీల కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిస్థితి ఇలాగే ఉండగా, సకాలంలో ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. లేకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

**- రాయికల్ / వేములవాడరూరల్ / ధర్మారం, మే 17**

### రైతులంటే పట్టింపులేదా..?



మా అనుపురం ఊళ్లే కేంద్రానికి వడ్లు తెచ్చి నెల రోజులు దాటింది. వడ్లు ఎండిన తర్వాత కాంట పెట్రిన్రు. బస్తాలల్ల నింపిన్రు. పదిహేను రోజుల సంది కేంద్రానికి లారీలే వస్తలేవు. ఎప్పుడో ఒకటి వస్తున్నా అందరి రైతుల బస్తాలు ఎక్కడ పోతయి. ఇంకా కేంద్రంలోనే సంచులు ఉన్నాయి. వానకు తడుస్తయనే రందివట్టుకుంది. మళ్లీ పంట సాగుచేసుకునే టైం కూడా వచ్చింది. లారీ తెప్పించాలని అధికారులను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకుంటలేరు. ప్రభుత్వానికి మా రైతులంటే పట్టింపులేనట్టే ఉంది. అందుకే మాకీ గోస అచ్చింది. ఏం చేయాలో తెలువకనే రోడ్డుమీదకు వచ్చినం.

**- మద్దెల భూమయ్య, రైతు (అనుపురం)**

### అదనపు కాంటాలు పెట్టాలె



మైతాపూర్‌లో 25 రోజుల కింద కొనుగోలు కేంద్రం పెట్టిన్రు. ఒకే కాంట ఉండడంతో కొనుగోలు లేటయితంది. పదిహేను రోజుల కింద వడ్లు తెచ్చినా ఇంకా కొనుడు కాలె. పొద్దంతా సెంటర్ ఉండి ధాన్యాన్ని కాపాడుకునేందుకే టైం అయిపోతంది. దీనికి తోడు అకాల వానలతో ఎప్పుడు ఏమైతదో అని భయమైతుంది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని అదనపు కాంటాలు పెట్టి, పది రోజుల్లో మొత్తం ధాన్యాన్ని కొనాలి.

**- శివనీతి అమరేందర్, రైతు (రాయికల్)**

### కాపాడుకోలేక గోస పడుతున్నరు



సర్కారు మైతాపూర్‌లో నామమాత్రంగా సెంటర్‌ను పెట్టి చేతులు దులుపుకున్నది. ఇక్కడ ఎలాంటి వసతులు లేవు. ధాన్యం ఎక్కడిదక్కడే పేరుకుపోతంది. గన్నీ సంచుల్లేవు. హమాలీలు, లారీల కొరత ఉన్నది. మరోపక్క అకాల వానలు పడుతుంటే ధాన్యాన్ని కాపాడుకోలేక రైతులు గోస పడుతున్నరు. ఇట్లయితే కష్టమని రైతులు విధిలేని పరిస్థితిల్లో ప్రైవేటు వాళ్లకు అగ్గవకే అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తంది. ఇప్పటికైనా సర్కారు స్పందించి ఆదుకోవాలె.

**- సద్ది మహిపాల్ పాల్ రెడ్డి, రైతు (మైతాపూర్)**



వేములవాడ రూరల్: అనుపురంలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

### లారీల కొరత తీర్చాలని..

వేములవాడ రూరల్ మండలంలోని అనుపురం రైతులు రోడ్డెక్కారు. వేములవాడ –కరీంనగర్ రహదారి పై బైఠాయించి ధర్నా చేశారు. గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి రోజులు గడుస్తున్నా కొనడం లేదని, ఇంకా లారీలు రాకపోవడంతో బస్తాలు పేరుకుపోయి వర్షానికి తడుస్తున్నాయని వాపోయారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ధర్నా విషయం తెలుసుకొని సీఐ వీరప్రసాద్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. అలాగే కొనుగోలు కేంద్రాన్ని డీసీవో సందర్శించి బస్తాలను తరలిస్తామని హామీఇచ్చారు.

### ధాన్యం కొనాలని..

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్‌లో రైతులు ధర్నా చేశారు. గ్రామంలో కేంద్రం ఏర్పాటు చేసి పదిహేను రోజులవుతున్నా కనీసం 50 మంది రైతుల ధాన్యాన్ని కూడా కొనలేదని మండిపడ్డారు. కేంద్రంలో వసతులు లేవని, సరిపడా గన్నీ సంచులు లేవని, హమాలీలు, తూకం వేసే కూలీల కొరత ఉందని, ఇలా అయితే కొనుగోళ్లు ఎలా ముందుకెళ్తాయని ప్రశ్నించారు. లారీల కొరతతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించడం లేదని, వర్షానికి బస్తాలు తడిసిపోతున్నాయని వాపోయారు. ధర్నా విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లను వెంట వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



రాయికల్ : మైతాపూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు



### తడిసిన ధాన్యాన్ని కొనాలి..

మాది సూరయ్యపల్లి. ఊళ్లే మూడెకరాలల్ల వరి వేసిన. మొన్నటిదాకా సాగునీళ్లు రాక, కరెంట్ సరిగ్గా ఉండక అరిగోసపడ్డ. ఎట్లనో ఎల్లతీసుకొని పంట పండించుకున్న. తీరా వరి కోసి వడ్లు కొనుగోలు కేంద్రాలకు తెస్తే కొనేటోళ్లే లేరు. మా ఊరు పక్కనే ఉన్న మంథనిలోని ఏఎంసీ కొనుగోలు కేంద్రానికి 15 రోజుల కింద ధాన్యం తెచ్చిన. కానీ అధికారులు కాంటా పెట్టలే. ఏమైందని అడిగితే రేపు, మాపంటూ దాటేసిన్రు. అకాల వాన వచ్చి నా ఎకరంనర పంట తడిసిపోయింది. నా బాధ ఎవలికి చెప్పుకోవాలె. ముందే కొని ఉంటే నాకీ పరిస్థితి వచ్చేది కాదు. తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

**- శ్రీనివాస్, రైతు, సూరయ్యపల్లి (మంథని)**



మంథని మండలం మల్లేపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

# ముంచెత్తిన వాన

మంథని/మంథని రూరల్/వేములవాడ/కోల్‌సిటీ/ రుద్రంగి/ మే 17: ఉమ్మడిజిల్లాలో గురువారం బీభత్సం సృష్టించిన గాలివాన, శుక్రవారం కూడా అక్కడక్కడ ముంచెత్తింది. ప్రధానంగా మంథని, రామగుండం, వేములవాడ, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో దంచికొట్టింది. మధ్యాహ్నం తర్వాతి నుంచే పడుతూ.. రైతన్నకు తీరని వేదనను మిగిల్చింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. మంథని మండలం ఆరెంద, వెంకటాపూర్, మల్లారం గ్రామాల్లో కోతకొచ్చిన వరి నేలవాలింది. మామిడి కాయలు రాలిపోయాయి. ఖానాపూర్‌లో గాలి దుమారానికి వరి పొలాల్లో ఎల్‌టీ లైన్ కరెంట్ వైర్లు తెగిపడడంతో మేతకు వెళ్లిన అమ్మకుంటి సమ్మయ్యకు చెందిన రెండు బర్రెలు కరెంట్‌షాక్‌తో మరణించాయి. గోదావరిఖనిలో వర్షం దంచికొట్టడంతో జనజీవనం స్తంభించింది. వేములవాడలో 2.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్డుపై వరదపారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. రుద్రంగి మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నీట మునిగింది.



మంథని రూరల్: ఖానాపూర్‌లో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదెలు

### పల్లెల్లో అంధకారం

బోయినపల్లి/ తిమ్మాపూర్ మే 17: బోయినపల్లి మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. కరెంట్ తీగెలు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచి చీకట్లు అలుముకున్నాయి. 24 గంటలు దాటినా పునరుద్ధరించకపోవడంతో కొదురుపాక, దేశాయిపల్లిలో అంధకారం నెలకొన్నది. అలాగే కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని 33/11 కేవీ విద్యుత్ లైన్ స్తంభం వంగడంతో రామకృష్ణకాలనీ, ఇందిరానగర్ గ్రామాల్లో సైతం కరెంట్ సరఫరా నిలిచిపోయింది. పునరుద్ధరణ పనుల్లో జాప్యం జరగడంతో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు అంతరాయం కలిగింది.



మంథని: మార్కెట్ యార్డులో వర్షంలో తడుస్తున్న ధాన్యం



కొండూరికి దరఖాస్తు అందజేస్తున్న సింగిల్‌విండో చైర్మన్ కిషన్‌యాదవ్, పాలకవర్గ సభ్యులు

## కేడీసీసీబీలోకి పెద్దూరు సింగిల్‌విండో

సిరిసిల్ల రూరల్, మే 17: మున్సిపల్ పరిధిలోని పెద్దూరు సింగిల్‌విండో కేడీసీసీబీలో విలీనం కానున్నది. ఈ మేరకు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుకు చైర్మన్ జీల కిషన్‌యాదవ్, వైస్ చైర్మన్ బెజ్జారపు నారాయణగౌడ్, పాలకవర్గ సభ్యులు దరఖాస్తు అందజేశారు. ఇప్పటి వరకు ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలో ఉన్న పెద్దూరు సింగిల్‌విం డో, ఇక నుంచి కేడీసీసీబీలో విలీనం కానున్నది. కేడీసీసీబీ ద్వారా రైతులకు మెరుగైన సేవలందుతాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొండూరి రవీందర్‌రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ సీఈవో గౌరీశంకర్, డైరెక్టర్లు సలేంద్రి బాలరాజు, ముషికం సత్తయ్య, తదితరులు ఉన్నారు.

# ప్రాణం తీసిన నాలుగేళ్ల కక్ష

- ఇంటి స్థలం విక్రయ విషయంలో తలెత్తిన గొడవలు
- తనకు దక్కలేదని మరో వ్యక్తిపై కోపం
- గురువారం అర్ధరాత్రి ఇద్దరిపై దాడి
- అక్కడికక్కడే ఒకరి మృతి.. దవాఖానలో మరొకరు
- మృతులిద్దరూ వరుసకు సోదరులు
- ఉలిక్కిపడ్డ గోపులాపూర్





దీటి శ్రీనివాస్, దీటి మహేశ్(ఫైల్)

ధర్మపురి, మే 17: నాలుగేళ్ల కక్ష నిండు ప్రాణాలు తీసింది. ఇంటి స్థల విక్రయంలో తలెత్తిన వివాదం.. చివరకు ఇద్దరు సోదరులను బలితీసుకున్నది. తను కొంటానని అనుకున్న స్థలం దక్కలేదన్న కోపంతో రగిలిపోతున్న ఓ వ్యక్తి, అదును చూసి స్నేహితులతో కలిసి దాడి చేయడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. అడ్డుగా వచ్చిన మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి దవాఖానలో చనిపోవడం కలకలం రేపింది. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనతో గోపులాపూర్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డది. బుగ్గారం ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గోపులాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి నాలుగేళ్ల క్రితం తన ఇంటి స్థలాన్ని అదే ఊరికి చెందిన బుర్ర నవీన్‌కు అమ్ముతానని మాటిచ్చాడు. అయితే ఆయనకు కాకుండా గ్రామానికి చెందిన దీటి శ్రీనివాస్(38)కు ₹70 వేలకు విక్రయించాడు. అయితే తనకు స్థలం దక్కలేదన్న కారణంతో అప్పటి నుంచి శ్రీనివాస్‌పై నవీన్ కక్ష పెంచుకున్నాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య పలుసార్లు గొడవలు జరిగాయి. ఏళ్లు గడుస్తున్నా నవీన్ కోపం చల్లారలేదు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి శ్రీనివాస్ వరుసకు తమ్ముడైన దీటి మహేశ్ (36) ఇంటికి వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న బుర్ర నవీన్ అటుగా వెళ్తూ శ్రీనివాస్‌ను గమనించాడు. కొందరు స్నేహితులను వెంటబెట్టుకొని వచ్చి కర్రలతో దాడికి దిగారు. అడ్డుకునేందుకు వెళ్లిన మహేశ్‌ను సైతం చితకబాదారు. ఈ దాడిలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా.. ఈ వ్యవహారంతో ఏ సంబంధం లేని మహేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వరంగల్ దవాఖానకు తరలించగా, అక్కడ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందాడు. హత్య జరిగిన స్థలాన్ని అదనపు ఎస్పీ వినోద్‌కుమార్ పరిశీలించారు. శ్రీనివాస్ సోదరి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శ్రీనివాస్‌కు భార్య, మహేశ్‌కు భార్య, కొడుకు ఉన్నారు.

# ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, మే 17: షెడ్యూల్ కులాల విద్యార్థులు బెస్ట్ అవైలేబుల్ పథకం కింద ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యనభ్యసించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు పీ నతానియేల్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. 2024–25 సంవత్సరానికి గాను 1, 5వ తరగతుల్లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని, ఒకటో తరగతిలో 86 సీట్లు (నాన్ రెసిడెన్షియల్), 5వ తరగతిలో 175 సీట్లు (రెసిడెన్షియల్) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బెస్ట్ అవైలేబుల్ పథకం కింద వ్యవసాయ కార్మికులు, మొదటి తరం అక్షరాస్యత కలిగిన కుటుంబాలకు 50 శాతం, అనాథ పిల్లలకు 20శాతం, జోగిని పిల్లలకు 15శాతం, వలస కార్మికుల పిల్లలకు 15 శాతం రిజర్వ్ చేశామని, జిల్లాకు చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి కుటుంబ ఆదాయం ₹2లక్షలు, పట్టణ ప్రాంతాలకు చెందిన వారైతే ₹1.50లక్షలు మాత్రమే ఉండాలని, కులం, ఆదాయం, నివాసం, రేషన్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను దరఖాస్తులకు జత చేసి ఈ నెల 18 నుంచి జూన్ 7 వరకు జిల్లా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.